## క్లుప్తంగా...

### నియామకం


జల్లి సాకేత్ రామ్

గౌలిపురా: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గౌలిపురా డివిజన్ కన్వీనర్‌గా లాల్‌దర్వాజా పంచముఖి హనుమాన్ ఆలయ ప్రాంతానికి చెందిన జల్లి సాకేత్ రామ్ నియమితులయ్యారు. హైందవ సమాజం, ఐక్యత కోసం ఆర్‌ఎల్‌వై అసోసియేషన్‌తో సామాజిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న తనకు ఈ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని సాకేత్‌రామ్ అన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవీ అప్పగించినందుకు ఉత్సవ సమితి పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### శ్మశాన వాటికలో పచ్చదనం పెంచేందుకు చర్యలు



గోల్కొండ: కార్వాన్‌లోని గణేష్ ఘాట్ హిందూ శ్మశాన వాటికలో పచ్చదనం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధి జొన్న కుంటి మధుసూదన్ అన్నారు. సోమవారం కమిటీ సభ్యులతో కలిసి శ్మశానవాటికలో పర్యటించారు. అక్కిర శంకర్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, ఎస్.శ్రీనివాస్ తదితరులున్నారు.

### పోతరాజులకు సత్కారం



నాంపల్లి: మారు బోనాలను పురస్కరించుకుని పలువురు పోతరాజులకు సోమవారం సత్కారం జరిగింది. ఈ సత్కార సభకు హైదరాబాద్ జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వర్కల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నేతలు ఆలేరు భాస్కర్, జితేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 16 మంది పోతరాజులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, శ్యామ్‌రావు, జి.వేణుగోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### శాంతియుతంగా షెహదత్ ర్యాలీ


షెహదత్ ర్యాలీలో పాల్గొన్న షియా ముస్లింలు

చార్మినార్: అలీ అస్గర్ మరణాన్ని నిరసిస్తూ సోమవారం పాతబస్తీకి చెందిన షియా ముస్లింలు దారుషిఫా నుంచి సంకేశ్వర్ బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ..దారుషిఫాలోని అలవా-ఎ-సర్తాక్, మైదాన్-ఎ-గదీర్ అషుర్‌ఖానా నుంచి ప్రారంభమైన షెహదత్ ర్యాలీ పురానీహవేలీ, డబీర్‌పురా, చంచల్‌గూడ, సైదాబాద్ మీదుగా శంకేశ్వర్ బజార్‌లోని అషుర్‌ఖానా షెహజాదా-ఎ-అలీ అస్గర్ వరకు కొనసాగిందన్నారు. శాంతియుతంగా ర్యాలీ ముగియడానికి సహకరించిన అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



అబిడ్స్: క్రీడారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా పేర్కొన్నారు. హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రకాష్‌గుప్తా, హిమాన్ష్‌గుప్తా ఆధ్వర్యంలో మాతూర్ వైశ్య యువదళ్‌యాన్యువల్ స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మమతా గుప్తా, సంతోష్ గుప్తా మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గం క్రీడా మైదానాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో విశాల్ గుప్తా, వికాస్, మోహీద్, యాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


ఎంజేమార్కెట్ రోడ్డులో..

# దంచికొట్టిన వాన

**జలమయమైన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు | ఇబ్బందులు పడిన వాహనదారులు, ప్రజలు | సహాయక చర్యల్లో అధికారులు**

గోల్కొండ: మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గుడిమల్కాపూర్ ప్రధాన రహదారి కాలువగా మారింది. మెహిదీపట్నం పీవీ ఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ రోడ్డుకు ఇరువైపులా వరద నీరు నిలిచి ఉండడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. టోలిచౌకీ చౌరస్తాలో సుమారు నాలుగు అడుగుల మేర వర్షపు నీరు నిలిచిపోయింది. నదీమ్ కాలనీలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. సీనియర్ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, బల్దియా మాన్సూన్ స్క్వాడ్ వారితో కలిసి నదీమ్ కాలనీలో సహాయక చర్యలు చేపట్టారు. టోలిచౌకీ, సెవన్ టూంబ్స్ రోడ్డు పూర్తిగా జలమయం కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.


మాసబ్‌ట్యాంక్‌లో..

**సంతోష్‌నగర్‌లో..**

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెద్ద ఎత్తున వరద నీరు చేరుకున్నాయి. దీంతో సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ ఎస్సైలు, సిబ్బందితో కలిసి ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిలిచిపోయిన నీటిని సజావుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. ఆయనతో పాటు హైడ్రా, డీఆర్‌ఎఫ్ సిబ్బంది సైతం సహాయక చర్యలను చేపట్టారు.

**గౌలిపురా డివిజన్‌లో..**

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని అచ్చయ్యనగర్, హనుమాన్‌నగర్, అంబికానగర్, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్థానికులు, హైడ్రా, డీఆర్‌ఎఫ్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు మామిడాల శ్రీనివాస్‌లు వరదనీరు సజావుగా వెళ్లేందుకు మ్యాన్‌హోళ్లను తెరిచి చర్యలు చేపట్టారు.

**అబిడ్స్‌లో..**

అబిడ్స్: అబిడ్స్, ఎంజేమార్కెట్, గోషామహల్, ఆగాపురా, ధూల్‌పేట్, లక్డీకాపూల్, బషీర్‌బాగ్ తదితర ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. లక్డీకాపూల్ నుంచి మెహిదీపట్నం వరకు గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది.

**నాంపల్లిలో..**

నాంపల్లి: నాంపల్లిలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి మెహిదీపట్నం సర్కిల్-12 పరిధిలో 53.3 శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. అహ్మద్‌నగర్, ఫస్ట్‌లాన్సర్, బడా బజార్ కమ్యూనిటీ హాల్ ప్రాంతాల్లో అత్యధికంగా వర్షం కురిసింది. ఇక లోతట్టు ప్రాంతాలైన మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, హబీబ్‌నగర్, జవహర్‌నగర్, డి క్లాస్ క్వార్టర్స్, సీ క్లాస్ క్వార్టర్స్, వాంబే కాలనీ, రెడ్‌హిల్స్‌లోని జంగంబస్తీ, రైల్వే క్వార్టర్స్, ఆండాలమ్మ బస్తీ, దేవీభాగ్, టిప్పుఖాన్ సరాయి, వల్లభదాస్ బాడా, నాంపల్లి సరాయి ప్రాంతాలు నీట మునిగాయి.


టోలిచౌకీ చౌరస్తా వద్ద రోడ్డుపై నిలిచిన నీరు


వరదనీరు వెళ్లేందుకు చర్యలు చేపడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ ఎస్సైలు, సిబ్బంది


హనుమాన్‌నగర్‌లో వరదనీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు చేపడుతున్న నాయకులు

## ఫుట్‌పాత్ కబ్జాలపై ఉక్కుపాదం మోపాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న లక్ష్మణ్‌రావు

సుల్తాన్‌బజార్: జీహెచ్‌ఎంసీ సర్కిల్-14 పరిధిలో అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని యాంటి కరప్షన్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గన్‌ఫౌండ్రీ, జాంబాగ్ డివిజన్లలోని హనుమాన్‌టేక్డీ, బొగ్గులకుంట, జాంబాగ్ ప్రాంతాల్లో ఉన్న మయూర్ పాన్‌షాప్, నర్సింగ్ చాట్, రాయల్ టిఫిన్‌సెంటర్, ప్రగతి టిఫిన్ సెంటర్ తదితర వ్యాపార సంస్థలు తమ వ్యాపారాల కోసం రోడ్డుపైనే వినియోగదారుల పార్కింగ్ చేయిస్తుండడంతో ఆ రోడ్డున వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా జాంబాగ్ చౌరస్తాలో పూల వ్యాపారులు సైతం ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే చాదర్‌ఘాట్ సిగ్నల్ నుంచి సుల్తాన్‌బజార్ ఉమెన్స్ కళాశాల వరకు వ్యాపారులు రోడ్లపైననే పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు సైతం దీనిపై దృష్టి సారించి అక్రమ పార్కింగ్‌లపై ఉక్కుపాదం మోపాలని కోరారు.

## కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

విజయనగర్‌కాలనీ: దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ, విశ్వక్షేణ పూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, అంకురార్పణం, వయినతేయ ధ్వజ ఛాయాదివాసం, మంగళ శాసనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరిగె శ్రీనివాస్ ట్రస్ట్ సభ్యులు సామల శ్రీనివాస్, బి.రమేష్‌కుమార్, దాస శ్రీనివాస్, పూజోలు అంజయ్య యాదవ్, జి.వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

**నేటి పూజలు..**

బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు మంగళవారం లంగర్ హౌస్ ముచ్‌కుందానది వీర రాఘవ రామాలయం పండితులు రాహుల్‌దాస్ బాబా చేతుల మీదుగా ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుంది. సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందజేస్తారు. రాత్రి భవానీశంకర ఆలయ భజన మండలి వారిచే భజన కార్యక్రమం ఉంటుంది.

## ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలి

గౌలిపురా: వినాయక చవితి ఉత్సవాలను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని సాయిదత్త రామానంద గురూజీ అన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి యాకుత్‌పురా నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ పి.రాజేశ్వర్‌రావు అధ్యక్షతన శివ పార్వతీ ఫంక్షన్ హాల్‌లో గౌలిపురా డివిజన్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మండపాల నిర్వాహకులకు వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి కౌడి మహేందర్, సెంట్రల్ కమిటీ సభ్యులు ఆలే భాస్కర్ రాజ్, రూప్‌రాజ్, శ్రీనివాస్, యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ శ్రీనాథ్, కో కన్వీనర్ రాజేశ్, గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయిదత్త రామానంద గురూజీ

## వైభవంగా శ్రావణ సోమవారం పూజలు

డబీర్‌పురా: శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీరామ ఆలయంలో సోమవారం సాయంత్రం భస్మాభిషేకం అనంతరం అలంకరణ నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ పూజారి బొంగులూరి రాంమూర్తి శాస్త్రి, శ్రీను, విశ్వం, మిట్టు పంతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ఫ్లోరింగ్ పనులు ప్రారంభం



అబిడ్స్: గుడిమల్కాపూర్ నల్లపోచమ్మ ఆలయంలో ఫ్లోరింగ్ పనులను గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట నాగేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశోక్ పూజలు చేసి పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఈ ఆలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి భుజేందర్‌కుమార్ ఎంతో సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ రేషన్ కార్డులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు అంజన్‌కుమార్‌యాదవ్

గోల్కొండ: అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తుందని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి షేక్‌పేట్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వినోభానగర్, వివేకానందనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమర్థ పాలనకు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షులు డి.సత్యనారాయణ, సదానంద్, వెంకటేష్, మక్బుల్ ముజీబ్, మోహిన్, ఎం.అశోక్ తదితరులున్నారు.

### చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్

గౌలిపురా: చోరీకి పాల్పడిన ఓ వ్యక్తిని మొఘల్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... సుల్తాన్‌షాహీ వాల్మీకి స్వామి ఆలయ ప్రాంతానికి చెందిన కె.దయానంద్ తన కుటుంబసభ్యులతో కలిసి గత నెల 26న తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లారు. ఈ నెల 1న ఇంటికి వచ్చి చూసేసరికి అల్మారా పగలగొట్టి అందులో ఉన్న 1.75 తులం బంగారు ఆభరణాలను చోరీకి గురయ్యాయి. దీంతో దయానంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం దొంగతనానికి పాల్పడిన తార్నాక ప్రాంతానికి చెందిన అజయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా అజయ్ సుల్తాన్‌షాహీకి తన బంధువుల వద్దకు వచ్చిన సమయంలో ఈ దొంగతనానికి పాల్పడ్డాడు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభం


డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభంలో స్థానిక నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

చార్మినార్: గత కొన్ని ఏళ్లుగా డ్రైనేజీ సమస్యతో బాధపడుతున్న జంగమ్మెట్ డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్ బస్తీవాసుల సమస్య తీరే రోజు వచ్చింది. సంబంధిత అధికారులు స్పందించి కొత్తగా డ్రైనేజీ పైప్‌లైన్ వేయడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు ఇప్పటికే స్థానిక నాయకులు సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేయడం జరిగింది. అంతేకాకుండా ఈ విషయాన్ని 'సాక్షి'దినపత్రిక ఎన్నాళ్లిలా..? అనే శీర్షికతో వార్త కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు అంబేడ్కర్ బస్తీలో కొత్తగా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులను మంజూరు చేసి ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం స్థానిక బస్తీ అధ్యక్షుడు బాబురావు, చీఫ్ అడ్వైసర్ విజయకుమార్, గోదా ప్రదీప్ కుమార్, కిరణ్, అంజాద్ తదితరులు కలిసి పనులను ప్రారంభించారు.

## ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ (ఫీమేల్) ఉద్యోగులకు రావాల్సిన స్పెషల్ ప్రమోషనల్ పోస్ట్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యాదనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్)లకు ఆరు వారాల ఎల్.హెచ్.వి. ట్రెనింగ్ పూర్తి చేయలేదనే కారణంతో 12, 18 ఏళ్ల స్పెషల్ ప్రమోషన్ పోస్టు ఇంక్రిమెంట్ ఇవ్వడం లేదన్నారు. ఫలితంగా 18 ఏళ్ల సర్వీస్ పూర్తయినా పై క్యాడర్‌లో ప్రమోషన్ దొరకకా కనీసం ప్రమోషన్ క్యాడర్ ఇంక్రిమెంట్ లభించక ఎంపీహెచ్‌ఏ ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ చొరవ తీసుకుని ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని ఆయన కోరారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీహెచ్‌ఏ ఉద్యోగులు

## వాణిజ్య విభాగంలో యువతను ప్రోత్సహించాలి


విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆంథోని సాగయ రాజ

గన్‌ఫౌండ్రీ: వాణిజ్య విభాగంలో యువతను ప్రోత్సహించాలని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ ఆంథోని సాగయ రాజ అన్నారు. సోమవారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో వాణిజ్య దినోత్సవ వేడుకలు, మీడియా ఎక్స్‌పో, పరంపర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి యువతరాన్ని వాణిజ్య నాయకులుగా బలమైన వృత్తిపరమైన వేదికలను అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జర్నలిజం కూడా ముద్రణ నుంచి డిజిటల్ రంగం వైపు అడుగులు వేస్తున్నాయన్నారు. వాణిజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మేళాకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని ఇతర రాష్ట్రాల నుంచి సైతం విద్యార్థులు హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం చేనేత కళాకారులకు అంకితం చేస్తూ పరంపర పేరిట నిర్వహించిన సాంస్కృతిక కళా ఉత్సవాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది గ్లేస్ డిసిల్వ, డాక్టర్ గీతాంజలి, లాస్య తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్‌లో బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ విద్యార్థుల సత్తా

సంతోష్‌నగర్: డీఏవీ పాఠశాల నిర్వహించే డీఏవీ క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ఈ నెల 2, 3వ తేదీల్లో డీఏవీ భానూర్‌లో జరిగిన యోగా, చెస్, హ్యాండ్ బాల్, టేబుల్ టెన్నీస్, కరాటే, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ తదితర పోటీల్లో బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాల విద్యార్థులు పాల్గొని జయకేతనం ఎగరవేశారు. అలాగే అండర్-14, 17 బాలికల విభాగంలో యోగా, రీలే కరాటే పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్-14 బాల బాలిక విభాగంలో జరిగిన నైట్ బాల్, అండర్-17 బాలుర విభాగంలో జరిగిన హ్యాండ్ బాల్, రీలే పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. అండర్-17 బాలికల విభాగం 1500 మీటర్, 400 మీటర్, 100 మీటర్ పరుగు పందెం పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాల విద్యార్థులు తమదైన సత్తాను చాటారు. డీఏవీ ఓరల్ చాంపియన్‌షిప్‌లో కూడా తమ విద్యార్థులు ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నారని ప్రిన్సిపాల్ వి.ఎస్.ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె.మధుబాల, డీఏవీ పాఠశాల ఏఆర్ఓ ఆనందవల్లీ, పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఎస్.ప్రశాంత్, బీడీఎల్ మిధాని ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.



సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

## విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ కన్వీనర్ మల్లయ్య చారి అన్నారు. ప్రగతి చెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 10, 8 విభాగాలలో బాలబాలికలకు చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చెస్ మాత్రమే కాదని పిల్లల్లో మేధో సంపతిని పెంపొందిస్తుందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయానంద్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### మామపై అల్లుళ్ల దాడి

నాంపల్లి: కుటుంబ కలహాల కారణంగా మామపై అల్లుళ్లు దాడి చేసిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే సర్దార్‌కు అదే బస్తీలో నివాసం ఉండే అల్లుళ్లు ఇర్ఫాన్, మునావర్‌కు కొంత కాలంగా కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ కలహాలు సోమవారం తీవ్రరూపం దాల్చడంతో మామ సర్దార్‌పై ఇర్ఫాన్, మునావర్ దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### 'జీఐఎల్‌టీ'లో స్పాట్ అడ్మిషన్స్

రాయదుర్గం: లెదర్ టెక్నాలజీలో తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక పాలిటెక్నిక్ కళాశాలగా గుర్తింపు పొందిన గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో ఖాళీ సీట్ల భర్తీకి శ్రీకారం చుట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశం ప్రకారం 'స్పాట్ అడ్మిషన్'ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ సోమవారం తెలిపారు.

### రోలర్ స్కేటింగ్ అభివృద్ధిపై సమావేశం


మల్లారెడ్డిని కలిసిన తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ రోలర్ స్కేటింగ్ సభ్యులు

డబీర్‌పురా: తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.మల్లారెడ్డిని సోమవారం తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ రోలర్ స్కేటింగ్ సభ్యులు మహ్మద్ అహ్మద్, ఖాజా మునీర్ ఉద్దీన్, జావీద్ పాషా, వసీం జహాన్ కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోలర్ స్కేటింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌లో రోల్ స్కేటింగ్ అభివృద్ధికి సభ్యులు ఆయన మద్దతు కోరారు. అదనపు అంశాలను చర్చించడానికి తదుపరి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.